క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం నేడు

కొండాపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొడ్డు అనురాధ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

పోలేరమ్మ గుడి నిర్మాణానికి శంకుస్థాపన



మర్రిపాడు: డీసీపల్లిలో పోలేరమ్మ గుడి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామస్తులు శాస్త్రోక్తంగా శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. గుడి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కలిగిరి : మండలంలోని చీమలవారిపాళెం సమీపంలోని పొలాల్లో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై ఉమాశంకర్ గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14,800 నగదును స్వాధీనం చేసుకున్నారు.

మద్దతు ధర కల్పించాలని వినతి

నెల్లూరు(పొగతోట): ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పుట్టి రూ.20,187కు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు రాజగోపాల్, మూలి వెంగయ్య, లక్కు ప్రసాద్, జనార్దన్ కోరారు. శుక్రవారం నెల్లూరులో సివిల్ సప్లయ్స్ సంస్థ డీఎం అర్జున్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో 80 శాతం మంది రైతులు తక్కువ ధరలకు ధాన్యం విక్రయించారన్నారు. రూ.200 కోట్లకుపైగా నష్టపోయారన్నారు. ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోతాలను అందుబాటులో ఉంచాలన్నారు.

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో ఓ రైస్‌మిల్లులో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చిన్నచెరుకూరులో వినోద్‌రెడ్డికి చెందిన జీఆర్ పూజిత రైస్‌మిల్లులోని బాయిలర్‌లో హఠాత్తుగా మంటలు వ్యాపించాయి. పొట్టు కారణంగా మంటలు పెరిగాయి. రూ.50 వేల విలువైన పరికరాలు కాలిపోయినట్లు యజమాని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పూర్తి స్థాయిలో మంటలను అదుపు చేశారు.

కనీస వేతనమివ్వాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలన్నారు. నాణ్యమైన యూనిఫాం, సెల్‌ఫోన్లు అందించాలన్నారు. జనాభాకు అనుగుణంగా వర్కర్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 7వ తేదీన ఆశా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వద్ద ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మధుసూదన, లక్ష్మి, మేరి, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(టౌన్): విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు నరహరి శుక్రవారం ఒక ప్రకటనలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ నియమించి తనిఖీలు చేయాలన్నారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్

నెల్లూరు(టౌన్): నెల్లూరు మెడికల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గీతాంజలి మృతిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత తల్లిదండ్రుల ఆరోపణల ఆధారంగా విచారణ జరపాలన్నారు. నెల్లూరు నగరంలో ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నా జిల్లా అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. జిల్లాలో హాస్టళ్లలో వసతులు, సౌకర్యాలపై తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైభవంగా దసరా వేడుకలు



ఉదయగిరి: రాజరాజేశ్వరీదేవిగా పార్వతీదేవి



దుత్తలూరు బీసీ కాలనీలో గ్రామోత్సవం



సోమశిల: సీతారాముల పార్వేట ఉత్సవం



అల్లూరు: నార్త్‌మోపూరులో ఉమామహేశ్వరిగా పర్వతవర్ధిని

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా దసరా వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవాలను నిర్వహించారు. ఉదయగిరిలోని పార్వతీపరమేశ్వరాలయం, సంతానలక్ష్మి ఆలయం, బాలాజీనగర్‌లోని నాగార్పమ్మ, గండిపాళెంలోని గంగమ్మ ఆలయాల్లో రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయగిరిలోని సంతానక్ష్మి ఆలయంలో మానవ కల్యాణం కోసం హోమాలు నిర్వహించారు. పుల్లాయపల్లిలో అన్నదానం నిర్వహించారు. ఉదయగిరి పోలీసు స్టేషన్‌లో ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు.

- వింజమూరులోని చెన్నకేశవస్వామి ఆలయం, అయ్యప్పస్వామి మందిరం, శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, నల్లగొండ్లలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, గుర్రప్ప మందిరంలో విశేష పూజలు నిర్వహించారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం

అనుమసముద్రంపేట: మండల ప్రజలు దసరా పండగను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ఏఎస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా రాత్రి అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారిని విశేషంగా అలంకరించి ఊరేగించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుత్తలూరు: మండల ప్రజలు దసరా పండగను ఘనంగా జరుపుకొన్నారు. అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. దుత్తలూరులోని బీసీ కాలనీలో విజయదశమి సందర్భంగా అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గ్రామంలో ఊరేగించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కాలనీవాసులు సామూహికంగా పొంగళ్లు పెట్టారు. నర్రవాడలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నర్రవాడలోని వెంగమాంబ ఆలయం, దుత్తలూరులోని రాజరాజేశ్వరీదేవి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

వైభవంగా పార్వేట ఉత్సవం

సోమశిల: అనంతసాగరం మండల ప్రజలు దసరా పండగను ఘనంగా జరుపుకొన్నారు. వరికుంటపాడులోని రామాలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా సీతారాముల పార్వేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి అన్నదానం చేశారు. ఉభయకర్తగా జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, స్థానికులు వ్యవహరించారు. అలాగే సోమశిల, అగ్రహారం, రేవూరు, అనంతసాగరం, పాతాళపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లోనూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అల్లూరు: మండల వ్యాప్తంగా దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. నార్త్‌మోపూరులోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ఉమామహేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

సంగం: మండల వ్యాప్తంగా దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంగంలోని తిరుమనకొండ రాజరాజేశ్వరీదేవి ఆలయం, సంగమేశ్వరస్వామి ఆలయం, వంగల్లులోని భీమేశ్వరాలయం, దువ్వూరులోని కోటేశ్వరస్వామి ఆలయం, అన్నారెడ్డిపాళెంలోని ఆత్మారామస్వామి ఆలయాల్లో గురువారం ఉదయం విశేష పూజలు నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవాలు నిర్వహించారు. సంగంలోని బాలచౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి ఉత్సవమూర్తిని పూలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

ఆత్మకూరురూరల్: పట్టణంతో పాటు మండలంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశీనాయన ఆశ్రమంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు బ్రహ్మశ్రీ మేళ్లచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీదేవి పీఠార్చన పూర్వక సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన, దేవీసూత్ర పారాయణం, మహానివేదనం, నక్షత్ర హారతి, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.



సంగంలో బాలచౌడేశ్వరీదేవి గ్రామోత్సవం



కాశీనాయన ఆశ్రమంలో దుర్గాదేవి అలంకారం



ఆత్మకూరు విశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణేశ్వరీదేవి అలంకారం



ఆత్మకూరురూరల్: అలఘునాథస్వామి దేవస్థానంలో శ్రీవారి కల్యాణోత్సవం



ఉదయగిరి: సంతానలక్ష్మి ఆలయంలో హోమం



ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో..



అనుమసముద్రంపేట: వాసవీమాత గ్రామోత్సవం

వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా మహాసభలు రేపు

సోమశిల: కొడవలూరు మండలం యల్లాయపాళెంలో ఆదివారం జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం అనంతసాగరం మండలాధ్యక్ష, కార్యదర్శులు బందిల రమణయ్య, వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరాజు, మంగళ పుల్లయ్య పాల్గొంటారని తెలిపారు. గత కొన్నేళ్లు వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాలకు సంబంధించి కార్యాచరణను రూపొందించనున్నట్లు వివరించారు.

వైభవంగా గంధ మహోత్సవం



సీతారామపురం : స్థానిక సిండికేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న మహబూబ్ సుభాని దర్గాలో గంధ మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. హక్కుదారులైన షేక్ పెద్దగౌస్ ఇంటి వద్ద నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపి భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణంలో అన్నదానం చేశారు.

ఆత్మకూరు మున్సిపాలిటీకి స్వచ్ఛాంధ్ర పురస్కారం

ఆత్మకూరురూరల్ : ఆత్మకూరు మున్సిపాలిటీ స్వచ్ఛాంధ్ర పురస్కారానికి ఎంపికైంది. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆరు మున్సిపాలిటీలు, ఆరు గ్రామ పంచాయతీలను పురస్కారాలకు ఎంపిక చేయగా అందులో ఆత్మకూరు మున్సిపాలిటీ చోటు దక్కించుకుంది. ఈ నెల 6న సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పురస్కారాలను అందజేయనున్నట్లు మున్సిపల్ పాలకవర్గాలు పేర్కొన్నాయి. మున్సిపాలిటీకి స్వచ్ఛాంధ్ర పురస్కారం రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

శివాలయం పునర్నిర్మాణంపై సమావేశం

కలిగిరి: కలిగిరిలోని శివాలయం ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు శుక్రవారం సమావేశమయ్యారు. ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి దేవదాయశాఖ అనుమతులు, కమిటీ సభ్యుల విధివిధానాలు, విరాళాల సేకరణపై చర్చించారు. ఆలయ నిర్మాణాన్ని ఒకటిన్నర సంవత్సరంలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆలయం చుట్టూ ఉన్న దుకాణాలను ఈ నెల 26వ తేదీలోగా ఖాళీ చేయాలని నిర్వాహకులకు సూచించారు. నవంబర్ 1న బాలాలయానికి భూమిపూజ, డిసెంబర్ 1న బాలాలయ ప్రవేశం, నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. శివాలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పూర్తిసహకారం అందించాలని కోరారు.



శివాలయం నిర్మాణంపై చర్చిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు

యూరియా కోసం నమోదు చేసుకోవాలి

అనుమసముద్రంపేట: రబీ పంట సాగుచేసే రైతులు యూరియా కోసం ముందుగా రైతుసేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఏఓ సురేష్ బాబు సూచించారు. కావలియడవల్లి సచివాలయంలోని రైతులకు యూరియా వినియోగంపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో ఎకరాకు 3 బస్తాలు చొప్పున యూరియాను మాత్రమే వినియోగించాలని సూచించారు. రబీ పంట కాలానికి గానూ యూరియా పంపిణీ కార్డు ద్వారా మూడు విడతలుగా మూడు బస్తాలు మాత్రమే యూరియాను అందజేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న ఏఓ సురేష్‌బాబు

సీఐటీయూ జిల్లా మహాసభల జయప్రదానికి పిలుపు

ఉదయగిరి: తోటపల్లిగూడూరు మండలం నరుకూరులో ఈ నెల 11,12 తేదీల్లో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రెహానాబేగం పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఐటీయూ మండల మూడో మహాసభలో ఆమె మాట్లాడారు. కార్మికులపై పని గంటల భారాన్ని తగ్గించి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. అనంతరం 15 మందితో నూతన మండల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ విజయమ్మ, రైతు సంఘ నాయకులు కాకు వెంకటయ్య, సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, కోడె రమణయ్య, మహిళా సంఘం నాయకులు కామాక్షమ్మ, విజయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడుతున్న రెహానాబేగం

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

సీతారామపురం : రీ సర్వేతో రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ షేక్ ఫజిహా అన్నారు. దేవమ్మచెరువు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రీసర్వే గ్రామసభలో తహసీల్దార్ మాట్లాడారు. గతంలో జరిగిన సర్వేలో తప్పులు ఉన్నట్లయితే వాటిని రీ సర్వేలో సవరిస్తామన్నారు. రైతులు క్రయవిక్రయాలు జరిపిన వెంటనే రెవెన్యూ రికార్డుల్లో తమ భూహక్కులను నమోదు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కారం చూపిస్తామన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ సుభాని, వీఆర్వో బాలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరు: మండలంలోని సింగపేట గ్రామంలో రీసర్వేపై గ్రామసభను తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. రీసర్వే సిబ్బందికి రైతులు సహకారం అందించాలని ఆయన కోరారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నరసింహమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ ప్రభుదీప్ తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురం: గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫజిహా

ఉదయగిరి: గండిపాళెంలో శనివారం నుంచి చేపట్టే భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ ఎల్ రామ్మోహన్ కోరారు. శుక్రవారం గండిపాళెంలోని రామాలయం వద్ద రీసర్వేపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 2,500 ఎకరాలు వ్యవసాయ భూమిని సర్వే బృందం సర్వే చేస్తుందన్నారు. రైతులు సర్వే సమయంలో భూములకు సంబంధించిన ఆధారాలను సర్వే అధికారులకు చూపి సర్వేయర్ భాగ్యలక్ష్మి, సర్వేయర్ నాయబ్‌రసూల్, వీఆర్వో బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.325

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు గరిష్టంగా రూ.325 ధర లభించింది. వేలానికి 1226 బేళ్లు రాగా, 1008 బేళ్లను విక్రయించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.325, కనిష్టంగా రూ.79, సగటున రూ.234.88 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.326 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 734 బేళ్లను తీసుకురాగా, 631 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.326, కనిష్టంగా రూ.80, సరాసరిన రూ.271.31 ధర పలికిందని వేలం కేంద్రం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

యూటీఎఫ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఆత్మకూరురూరల్: పట్టణంలోని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ, దివంగత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు. గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు యూటీఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మకూరు యూనిట్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రావు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం : మండలంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఉదయగిరి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిన్నస్వామి నాయక్ శుక్రవారం తెలిపారు. ఉదయగిరి, కుర్రపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా సీతారామపురానికి వచ్చే 33 కేవీ ఫీడర్‌కు విద్యుత్ సరఫరాను నాలుగు గంటల పాటు నిలిపివేస్తున్నామని వివరించారు.

జీఎస్టీ 2.0పై రైతులకు అవగాహన

ఉదయగిరి రూరల్: మండలంలోని కొండాయపాళెం, ఉదయగిరి బిట్–1లో ఏఓ విజయభాస్కర్ ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యంత్ర పరికరాల మీద జీఎస్టీని భారీగా తగ్గించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ సీజన్ ఆరంభం ముందు జీఎస్టీ తగ్గడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గాంధీ జీవితం ఆదర్శనీయం



ఆత్మకూరురూరల్: గాంధీకి నివాళులర్పిస్తున్న ఎంపీఐ రాములు

ఆత్మకూరురూరల్: మహాత్మ గాంధీ జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంతో పాటు మండలంలోని వాడవాడలా గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జీవీ రమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్, ఉపరవాణాశాఖ కార్యాలయంలో ఎంవీఐ రాములు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో..

ఉదయగిరి: మండల తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటాని అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహాత్ముడి సేవలను స్మరించుకున్నారు. డీటీ షాజియా, ఎస్సై కే ఇంద్రసేనారెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ కరిముల్లా, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూసమస్యలను పరిష్కరించాలని ఆందోళన

ఉదయగిరి రూరల్: బండగానిపల్లె పంచాయతీలో చేపట్టిన భూముల రీసర్వేలో చోటు చేసుకున్న తప్పిదాలను సరిచేసి ఆన్‌లైన్‌లో వన్‌బీ, అడంగళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. మండలంలోని బిజ్జంపల్లిలో రైతు సంఘం ఆధ్వర్యంలో భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే సిబ్బంది చేసిన పొరపాటుతో భూములకు సంబంధించిన రికార్డులు ఆన్‌లైన్‌లో రాక రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులకు తప్పులను సరిచేయాలని ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి భూసమస్యను పరిశీలించి వన్‌బీ అడంగల్ ఆన్‌లైన్‌లో వచ్చేలా చూడాలని కోరారు. బ్యాంకుల్లోని రుణాలను రీ షెడ్యూల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.



నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి పనులు

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడిలో ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధి కూలీలతో తన సొంత పనులు చేయించుకుంటున్నారు. గ్రామసభలో తీర్మానించిన పనులను కాకుండా వ్యక్తిగత ట్రాక్టర్లకు కంకర లోడ్ చేసే పనులు చేయిస్తున్నారు. అంతేకాకుండా ఒకచోట పని చేయించి, మరోచోట ఫొటోలు తీసి మస్టర్లు వేసి అవకతవకలకు పాల్పడుతున్నారు. ఉపాధి పనులకు హాజరుకాకున్నా వలస వెళ్లిన వారి పేర్లతో దొంగ మస్టర్లు వేసి సుమారు రూ.4లక్షలకుపైగా నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై మండలాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి అవకతవకలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కంకరను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న ఉపాధి కూలీలు

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఉదయగిరి రూరల్: పట్టణంలోని మంగళగిరి కాలనీలో గత కొన్నిరోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచ్ పీ సామ్రాజ్యం, ఉప సర్పంచ్ షేక్ ముర్తుజాహుస్సేన్ సహకారంతో శుక్రవారం పరిష్కరించినట్లు డిప్యూటీ ఎంపీడీఓ కరిముల్లా తెలిపారు. తాగునీటి పైపులైన్లు బ్లాక్ కావడంతో గత కొన్ని రోజులుగా తాగునీరు సరఫరాకాక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు.

